క్లుప్తంగా

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం



అమీర్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న పితాని బాలకృష్ణ తదితరులు

తాళ్లరేవు: రెండు కిడ్నీలు పాడైపోయి చికిత్స పొందుతున్న ముడికి అమీర్‌కుమార్‌కు జనసేన పార్టీ నాయకుడు పితాని బాలకృష్ణ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఉప్పంగలలోని బాధితుడి ఇంటికి వెళ్లి అమీర్‌కుమార్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో అత్తిలి బాబూరావు, నాయకులు వీఆర్ఎస్‌బీ ప్రసాద్, ముత్యాల జయలక్ష్మి, వంగా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో విశ్రాంతి భవనం



లక్ష్మివాడ శ్మశాన వాటికలో నిర్మించిన విశ్రాంతి భవనం

కాట్రేనికోన: మండలంలోని లక్ష్మివాడ పంచాయతీ శ్మశాన వాటికలో విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. తమ ఆత్మీయుల కర్మకాండలు నిర్వహించేందుకు గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ చొల్లంగి శ్రీలక్ష్మి శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. పంచాయతీలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో శ్మశానానికి గ్రావెల్ రోడ్డు నిర్మాణంతో పాటు విశ్రాంతి భవనాన్ని నిర్మించారు.

విలసవిల్లి రామాలయంలో శ్రీచక్రార్చన



విలసవిల్లిలో నవగ్రహనక్షత్ర పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామాలయంలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర మహా సౌరయాగంలో సోమవారం 23వ రోజు శ్రీచక్రార్చన ఘనంగా నిర్వహించారు. యాగ కర్త మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, సౌర అష్టాకరి జపాలు చేసి భక్తులచే గోపూజ చేయించారు. విశాఖ నక్షత్ర జాతకులచే వెలగ మొక్కకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు నవగ్రహ నక్షత్ర పూజల్లో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ కార్యకర్త మృతి



అంగన్‌వాడీ కార్యకర్త కనక మహాలక్ష్మి(ఫైల్)

కాట్రేనికోన: కాట్రేనికోన పంచాయతీలోని కాట్రేనికోన మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో పని చేస్తున్న కార్యకర్త చిట్టూరి కనక మహలక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 11న విధి నిర్వహణలో భాగంగా కాట్రేనికోన సచివాలయం-1 మహిళా పోలీసుతో కలిసి ఇంటింటి సర్వే చేస్తున్న సమయంలో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. తలకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లు ఆమె భౌతికకాయంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేల్లంక పంచాయతీ కూనాలంకకు చెందిన నల్లా వెంకటేశ్వరరావు(35) పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. వెంకటేశ్వరరావు భార్య భాను ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. అక్కడి నుంచి వచ్చేయాలని వెంకటేశ్వరరావు ఆమెను ఒత్తిడి చేసినా రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగేశాడని స్థానికులు చెబుతున్నారు. ఎస్‌ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమలులో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

ముమ్మిడివరం: ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఈ నెల 9 నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఎంపీడీఓ ఏఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మార్చి 21 వరకూ కోడ్ అమలులో ఉంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలకు, విగ్రహాలకు ముసుగులు వేసి భద్రపరుస్తున్నట్లు చెప్పారు. తమ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, క్యాలెండర్లు తొలగిస్తున్నామన్నారు.

నింగీ నేలా ఒకటాయెలే..

రెండక్షరాల ప్రేమ.. రెండు హృదయాల్ని దగ్గర చేస్తుంది. ఆ ప్రేమ జంటతో ఏడడుగులు వేయిస్తుంది. మూడుముళ్ల బంధంలోకి అడుగు పెట్టిస్తుంది. అలా ఒక్కటైన ప్రేమికులు ఒకరినొకరు గౌరవించుకుంటూ అదే ప్రేమతో జీవితాన్ని కొనసాగిస్తే వారికి మధురానుభూతుల్ని మిగులుస్తుంది. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

చెక్కు చెదరని ప్రేమ



పాతికేళ్ల ప్రేమికులు బ్రహ్మం, నాగ సత్యదేవి

అమలాపురం టౌన్ : అమలాపురంలో నివసిస్తున్న ప్రేమికులు తాళాబత్తుల సత్యనారాయణ(బ్రహ్మం), నాగ సత్యదేవి. పాతికేళ్ల క్రితం మూడు ముళ్లతో ఒక్కటైన వారిద్దరూ జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ఒకరికొకరు తోడుగా నిలబడి ముందడుగేశారు. ఇద్దరూ ఒక్కటై ప్రేమికులందరికీ ఆదర్శంగా నిలిచారు. బ్రహ్మం, నాగసత్యదేవిలిద్దరూ దగ్గర బంధువులే.. కాని వారిద్దరి మధ్య ఆస్తుల అంతరాలు అడ్డొచ్చాయి. బ్రహ్మం మెకానిక్. నాగసత్యదేవిది ధనిక కుటుంబం. అయినా వారిద్దరూ తమ పెద్దల్ని ఎదిరించకుండా ఇరువైపులా కుటుంబాల్ని సానుకూలంగా ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరుకు చెందిన ఈ ప్రేమికులు 1997 మార్చి 14న మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. 1999లో ఉపాధి కోసం అమలాపురం వలస వచ్చి నాటి నుంచి ఇక్కడే స్థిరపడ్డారు. సొంతిల్లు కట్టుకున్నారు. వారికి ఇద్దరు మగ పిల్లలు. అమలాపురం శ్రీనివాస ఏటిగట్టు ప్రాంతంలో ట్రాక్టర్ల రేడియేటర్ల మెకానికర్‌గా పనిచేస్తూ నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు బ్రహ్మం. పాతికేళ్ల తమ ప్రేమకథలో ఎన్నో కష్టనష్టాలు ఎదురైనా తమ ప్రేమే జీవితంలో ముందుకు నడిపించిందని ఆ దంపతులిద్దరూ చెబుతున్నారు.

పెద్దలను ఒప్పించారు



భవానీశంకర్-పూర్ణిమా దేవి దంపతులు

ఆలమూరు: చదువుతున్న సమయంలో మొగ్గ తొడిగిన ప్రేమలో వైద్యాధికారి పి.భవానీశంకర్, పూర్ణిమాదేవి ఒకరిపైఒకరు ఆకర్షితులైనారు. దాదాపు పదేళ్ల ప్రేమ అనంతరం జీవితంలో స్థిరపడి కులాలు వేరైనా తల్లిదండ్రులను ఒప్పించి వైవాహిక బంధంలో అడుగుపెట్టారు. అయితే భార్య పూర్ణిమాదేవి తన ఇద్దరు చిన్నారుల ఆలనపాలన కోసం తన అధ్యాపక వృత్తిని వదిలేశారు. డాక్టర్ భవానీశంకర్-పూర్ణిమదేవి వైవాహిక జీవితం నేటికీ అన్యోన్యంగా కొనసాగుతుంది. వీరి ప్రేమ, జీవితంలో స్థిరత్వం, తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకున్న తీరు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. వైద్యాధికారిగా భవానీశంకర్ ప్రజలకు నిరాడంబరంగా వైద్యసేవలు అందిస్తూ పేదల పెన్నిధిగా పేరు గాంచారు.

అభ్యుదయ ప్రేమ

మలికిపురం: కులాలు వేరైనా అభ్యుదయ భావాలు కలిగిన వారిరువురూ ప్రేమ పేరుతో ఒక్కటయ్యారు. వారే సఖినేటిపల్లి మండలం ఉయ్యూరివారి మెరక గ్రామానికి చెందిన పెసల వీవీ సత్య వరప్రసాద్, మలికిపురానికి చెందిన మంగెన శ్రీదేవి. 14 ఏళ్ల క్రితం 2009లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకారం తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంఈడీ సైకాలజీ చేసిన శ్రీదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఎంఎస్సీ ఫిజిక్స్ చేసిన ప్రసాద్ విశ్వేశ్వరాయపురంలో వివేకానంద కాన్వెంట్ నడుపుతూ తక్కువ ఫీజులకే పేద విద్యార్థులకు విద్య నేర్పుతున్నారు. స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా పిల్లలలో ఒత్తిడి తగ్గించేందుకు పాఠశాల స్థాయిలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.



కుమార్తె, కుమారుడితో వరప్రసాద్-శ్రీదేవి దంపతులు

శ్రీదేవి అమ్మవారికి సంప్రోక్షణ



శ్రీదేవి అమ్మవారికి సంప్రోక్షణ నిర్వహిస్తున్న పండితులు, అర్చకులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మ వారి ఆలయం వద్ద జరుగుతున్న అమ్మవారి జన్మదిన వార్షిక మహోత్సవాలు పునః ప్రారంభమయ్యాయి. మహోత్సవాలు జరుగుతున్న సమయంలో ఆలయం ఎదురుగా ఏర్పాటుచేసిన యాగశాల నుంచి ఆదివారం ఓ శవయాత్ర వెళ్లడంతో ఉత్సవాలను ఆదివారం తాత్కాలికంగా నిలిపేశారు. సోమవారం అమ్మవారికి శాస్త్రోక్తంగా సంప్రోక్షణ నిర్వహించి ఆలయాన్ని, ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. బ్రహ్మశ్రీ భళ్లమూడి దివాకరశాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు కాళ్లకూరి సత్య సుబ్రహ్మణ్యంల పర్యవేక్షణలో పండితులు ఈ సంప్రోక్షణ క్రతువును నిర్వహించారు. సంప్రోక్షణ అనంతరం అమ్మవారికి హోమాలు, అభిషేకాలు, పూజలు చేశారు.

పంది మాంసాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు

అమలాపురం టౌన్: పట్టణంలో వైరస్‌తో పందులు చనిపోతున్న క్రమంలో పంది మాంసం అమ్మకాలపై నిషేధం విధించామని, ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్థానిక మార్కెట్‌లో నిషేధాజ్ఞలను కాదని కొందరు వ్యక్తులు పంది మంసాన్ని విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో మున్సిపల్ సిబ్బంది సంబంధిత మాంసం దుకాణాన్ని ఆదివారం మూసి వేయించారని చెప్పారు. ఇప్పుడిప్పుడే మృతి చెందుతున్న పందుల సంఖ్య తగ్గుముఖం పడుతున్న సమయంలో మాంసం విక్రయదార్లు మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మాంసం విక్రయాల నిషేధంపై రోజూ ఆటో ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తున్నామని చెప్పారు.

బైపాస్ రోడ్డు భూసేకరణ పూర్తిచేయాలి

ఆర్డీవో వసంతరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతరాయుడు

అమలాపురం రూరల్: దిండి నుంచి నరసాపురం వరకూ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవో ఎన్‌ఎస్‌వీఎస్ వసంతరాయుడు అధికారులను ఆదేశించారు. అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రాత్రి ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులతో భూసేకరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వసంతరాయుడు మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో వ్యవహరించి సర్వే, భూసేకరణ పనులు వీలైనంత వేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మృతుల పేర్లను తొలగించుకోవాలి

యానాం: రేషన్ కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మృతి చెందితే తక్షణం ఆ పేరును తొలగించుకోవాలని సివిల్ సప్లయిస్ అండ్ అఫైర్స్ డైరెక్టర్ ఎస్.శక్తివేలు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మృతుల వివరాలను వారి కుటుంబ సభ్యులు సివిల్ సప్లయిస్ శాఖకు అందజేస్తే వాటిని తొలగిస్తారన్నారు.

రాయితీలను సకాలంలో చెల్లించాలి



అంబాజీపేటలో ఆర్ఐకు వినతిపత్రం ఇస్తున్న రైతు సమాఖ్య సభ్యులు

అంబాజీపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు ఇచ్చే పెటుబడి రాయితీలను సకాలంలో చెల్లించాలని మాచవరం రైతు సమాఖ్య సభ్యులు పేర్కొన్నారు. పీఎం, సీఎం కిసాన్ నగదును రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని కోరుతూ అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సమాఖ్య నాయకులు నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సమాఖ్య సభ్యులు మాట్లాడుతూ రైతులకు, కౌలు రైతులకు ఇచ్చే పెట్టుబడి రాయితీలను జనవరి నెలలో ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. పంట పొలాలకు వచ్చే నీటి, మురుగు బోదెలు ఆక్రమణలకు గురయ్యాయని తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్ఐ ఎండీ ఇబ్రహీంకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఏజీఎల్ మోటార్లకు ఇచ్చే విద్యుత్ సరఫరాను వచ్చే వేసవిలో నీటితడులకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొర్లపాటి కోటబాబు, నక్కా భాస్కర్, ఎం.పరమేశ్వరరావు, ఎన్‌వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండరాముని వార్షికోత్సవం



కోదండ రామచంద్రస్వామి

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరం కముజువారిపాలెంలో వేంచేసిన కళ్యాణ కోదండ రామ చంద్రస్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని కళ్యాణ కోదండ రామ చంద్రస్వామి వారి భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

అంబాజీపేట: మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు కన్వీనర్లు సోమవారం తెలిపారు. అరిగెల శివకల్యాణ్, కో కన్వీనర్లుగా కోమలి సురేంద్ర కుమార్, నాగాబత్తుల శశి, వీరా శ్రీరామ్, నక్కా నవీన్‌లను నియమించారు. తమకు పదవులు వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు, పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కల్యాణ్ తెలిపారు.

కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దాం



కుష్ఠు వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు అందిస్తున్న దాతలు

మామిడికుదురు: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జిల్లా పారా మెడికల్ ఆఫీసర్ కేవీవీ వరలక్ష్మి సూచించారు. నగరం పీహెచ్‌సీ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందించిన కంచాలు, గ్లాసులు, కూరగాయలు, దుప్పట్లు, బ్రెడ్లు, పండ్లు, నిత్యావసరాలను కుష్ఠు వ్యాధి బారిన పడిన 28 మందికి పంపిణీ చేశారు. సమావేశంలో వరలక్ష్మి మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి కేసులు గతం కన్నా ఇప్పుడు గణనీయంగా తగ్గాయన్నారు. కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా మార్చే బృహత్తర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి, కుసుమ శ్రీధర్, హెచ్ఎం సీహెచ్ నిరంజని, డీపీఎంఓ కె.సాయిబాబా పాల్గొన్నారు.

17న మండల పరిషత్ సమావేశం

మామిడికుదురు: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కుసుమ వనజకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: సబ్‌స్టేషన్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం సీఆర్‌సీ, కొమరాజులంక 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. కొత్తకాలనీ, సీఆర్‌సీ రోడ్డు, వెదిరేశ్వరం రోడ్డు, రావులపాడు రోడ్డు, కొమరాజులంక ఏరియాలకు విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నీరు అందించాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

అంబాజీపేట: శివారు ప్రాంత భూములకు సాగునీరు అందక వరి చేలు ఎండిపోతున్నాయని తక్షణమే నీరు ఇవ్వాలని వ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘ నాయకులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఏ విధమైన ముందస్తు సమాచారం ఇవ్వకుండా వంతుల వారి విధానం ద్వారా నీటిని విడుదల చేయడం సంబంధిత శాఖ అధికారులకు సరికాదన్నారు. తక్షణమే వీటిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులకు అందజేసినట్లు రైతు సంఘ అధ్యక్షులు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, ఎ.శ్రీనివాస్, వీర రవి, ఎ.వీరభద్రరావు, కేవీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలు పరిశీలించిన ఎమ్మెల్యే



దరియాలతిప్పలో పంటకాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న దరియాలతిప్ప ప్రాంతంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, అధికారుల బృందంతో కలిసి సోమవారం పర్యటించారు. దరియాలతిప్పలోని సాగునీటి కాలువలను, మంచినీటి చెరువును పరిశీలించి రైతులతో మాట్లాడారు. సాగునీరు అందక పోవడంతో సుమారు 300 ఎకరాల్లో వేసిన దాళ్వా పంటపొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ మాట్లాడుతూ పంటపొలాలు ఎండిపోతున్న నేపథ్యంలో ఫ్రెంచి కెనాల్ నుంచి సాగునీటిని ఎక్కువగా విడుదల చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్‌తో, ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులతో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో పండు సిద్దార్థకుమార్, రైతుసంఘం అధ్యక్షుడు కోరుకొండ బాలయోగి, మట్టా సత్తిబాబు, సబ్బతి శ్రీనివాస్, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర తీరంలో జంతు కళేబరాల తొలగింపు

సాక్షి స్పందన

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాం గ్రామ పరిధిలోని సాగర తీరంలో చనిపోయిన జంతువుల కళేబరాలను పంచాయతీ సిబ్బంది సోమవారం తొలగించారు. అంతుచిక్కని వైరస్‌తో పర్యాటక భవనాల చెంతన పందులు చనిపోయి వాటి కళేబరాలు కుళ్లి దుర్వాసన వస్తున్నాయని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై 'కళేబరాలతో ఇబ్బంది' అనే శీర్షికన ఈ నెల 11న ప్రచురితమైన సాక్షి కథనానికి స్పందనగా అధికారులు చర్యలు చేపట్టి పందుల కళేబరాలను తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో బోల్తా పడిన ఆటో

అల్లవరం: గోడిలంక పంచాయతీ పరిధిలోని పెనుమాలపేట వద్ద బెండమూర్లంక ప్రధాన రహదారిపై అమలాపురం నుంచి ఓడలరేవు వైపుగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి ప్రాంతానికి చెందిన విశ్వనాథపల్లి దేవిమణి, ఆటోడ్రైవర్ వరప్రసాద్‌కి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు గోడిలంక పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వేగంగా వస్తున్న ఆటోకి కుక్కలు అడ్డు రావడంతో అదుపు తప్పి మూడు పల్టీలు వేసిందని స్థానికులు చెబుతున్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలి

ముమ్మిడివరం: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీల ఆర్గనైజింగ్ కార్యదర్శులు మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీలు డిమాండ్ చేశారు. స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పదవీ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫేస్ మాఫ్‌ను రద్దు చేయాలన్నారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పప్పు సుబ్బారాయుడికి అందజేశారు. కార్యక్రమంలో కొండేటి వెంకటలక్ష్మి, కుడిపూడి మల్లీశ్వరి, పెదపూడి రుక్మిణి, పెయ్యల అనసూయ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి రేషన్ కార్డు పునరుద్ధరణ

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన పితాని సత్యమహలక్ష్మికి రేషన్ కార్డు, పింఛన్ పునరుద్ధరించారు. సత్యమహాలక్ష్మి రేషన్ కార్డులో ఇద్దరు సచివాలయ ఉద్యోగుల పేర్లు ఉండడంతో రేషన్‌కార్డు, పింఛన్ తొలగించారు. అయితే హౌస్ హోల్డింగ్ మ్యాప్‌లో సాంకేతిక లోపం కారణంగా పింఛన్ కోల్పోయినట్లుగా జిల్లా కలెక్టర్‌కు ఆమె ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులతో మాట్లాడి సాంకేతిక లోపాలను సవరించి పింఛన్, రేషన్‌కార్డులను తిరిగి మంజూరు చేయించారు. కలెక్టర్ స్పందించి తనకు తిరిగి రేషన్‌కార్డు పునరుద్ధరించడంపై సత్యమహాలక్ష్మి ఆనందం వ్యక్తం చేసింది.

సోహిత్ తండ్రి ఫిర్యాదుతో శవ పంచనామా

కాట్రేనికోన: మండలంలోని పల్లంకుర్రు శివారు గొల్లగరువుకు చెందిన విద్యార్థి మోర్త సోహిత్ రాజవర్ధన్(11) ఈ నెల 4న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. గోడి గురుకుల పాఠశాలలో ఆహారం, వసతి సరిగా లేవని సోహిత్ ఇంటికి వచ్చేశాడంటూ అతడి తండ్రి వెంకట శ్రీహరి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించినట్లు కాట్రేనికోన ఎస్‌ఐ టి.శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్ మృత్యుంజయరావు, ఎస్‌ఐ టి.శ్రీనివాస్‌ల సమక్షంలో ముమ్మిడివరం వైద్యులు శవ పంచనామా నిర్వహించారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్ట్‌కి కొత్తపేటకు చెందిన దాత మహా శివబట్టు బ్రహ్మరాజు దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పెనుమత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను అభినందించి శేషవస్త్రాలు, ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు.

ప్రతి నెల 15న ప్రజా వినతుల స్వీకరణ

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరాజన్ ఆదేశాల మేరకు ప్రతి నెల 15వ తేదీ ప్రజా సమస్యల వినతుల రోజు(పబ్లిక్ గ్రీవెన్స్ డే)గా నిర్వహించనున్నట్లు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.మునిస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పబ్లిక్ గ్రీవెన్స్ డే రోజున యానాంలో అన్ని శాఖల అధిపతులు తమ ఆఫీసుల్లో ప్రజల నుంచి వచ్చే వివిధ సమస్యలపై వినతులను స్వీకరిస్తారని తెలిపారు. ప్రజావినతులకు సంబంధించి ఆయా ఆఫీసుల్లో తప్పనిసరిగా ప్రత్యేకమైన రికార్డును నిర్వహించాలని ఆదేశించారు. అర్జీదారులకు వినతులు ఇచ్చిన రోజునే సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో తెలియజేయాలన్నారు.

అక్రమంగా ఇసుక, మట్టి తరలింపు



శానపల్లిలంక రైల్వే వంతెన వద్ద ఉంచిన మట్టి, ఇసుక అక్రమంగా తరలింపుతో ఏర్పడిన గొయ్యి

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంక రైల్వే వంతెన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఇసుక, మట్టి నిల్వలను కొందరు రాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న కొంత మంది నాయకుల అండతో ఈ ఇసుక, మట్టిని అక్రమంగా తరలించి సొమ్ములు చేసుకుంటున్నారనే అభియోగాలు ఉన్నాయి. ఇంత జరుగుతున్న రెవెన్యూ యంత్రాంగం తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సామాన్యులు తమ అవసరాలు, మెరక పనుల కోసం మట్టి, ఇసుక తరలింపునకు రెవెన్యూ అధికారులు కనీసం అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. ఇంత పెద్ద మొత్తంలో మట్టి, ఇసుక శానపల్లిలంక నుంచి తరలిస్తుంటే రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు కనీసం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానిక తహశీల్దార్ రియాజ్ హుస్సేన్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, అధికారులతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా వీరభద్రుని బోనాల పండగ



యర్రంశెట్టివారిపాలెంలో వేంచేసిన వీరభద్రస్వామి

పి.గన్నవరం: యర్రంశెట్టివారిపాలెంలో వేంచేసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయంలో కొప్పుల వారి కుటుంబాల ఆధ్వర్యంలో జంగమదేవర వీర కుమారులతో సోమవారం వీరన్నబాబు బోనాల పండగ వైభవంగా జరిగింది. స్వామిని పురవీధుల్లో బ్యాండు మేళాలతో, బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. ఆలయ ఆవరణలో జమ్మిపూజ వద్ద పూజ చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న సమారాధన చేశారు. రాత్రి వీరభద్ర స్వామి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.